సాక్షి
సంగారెడ్డి

గురువారం । 9 । జనవరి । 2025



ఆకాశం నుదుట బొట్టు పెట్టి కింద నిశ్చల తటాకానికీ అద్దిన సూరీడు కెంజాయి వర్ణంలో ఇలా శోభిల్లాడు. సంగారెడ్డి కలబ్‌గూరు శివారులో కనువిందు చేసిన ఈ దృశ్యం బుధవారం సాక్షి కెమెరాకు చిక్కింది. ప్రకృతి ప్రేమికులూ సెల్ఫీలు దిగి అస్తమ సూర్యుడిని తమ మొబైల్ ఫోన్లలో బంధించారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

## న్యూస్‌రీల్

### నిబద్ధతతో డ్యూటీ చేయాలి

● డీజీ అభిలాష బిస్త్



సిబ్బందితో మాట్లాడుతున్న డీజీ అభిలాష బిస్త్

సంగారెడ్డి జోన్: పోలీసు శాఖలో అధికారులు తమకు కేటాయించిన విధులు నిబద్ధతతో నిర్వహించాలని డీజీ అభిలాష బిస్త్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆమె మల్టీజోన్ ఐజీ–2 సత్యనారాయణతో కలసి పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం, ఆయుధగారం, మోటార్ వెహికల్ సెక్షన్ తనిఖీ చేసి, పలు రికార్డులను తనిఖీ చేశారు. గతేడాది జరిగిన నేరాలు, వాటి నివృత్తికి జిల్లా పోలీసుశాఖ తీసుకున్న చర్యలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఎస్–నాబ్, ట్రాఫిక్ రద్దీ నివారణకు తీసుకున్న చర్యల గురించి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ వివరించారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ...సిబ్బంది బిల్స్ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

### ఖైదీలకూ ఉచిత న్యాయ సేవలు

జిల్లా న్యాయ సేవాధికారి రమేశ్



భోజనాన్ని రుచి చూస్తున్న రమేశ్

సంగారెడ్డి టౌన్: ఖైదీలు కూడా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ తెలిపారు. కందిలోని సెంట్రల్ జైలును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఖైదీలకు సరైన ఏర్పాట్లు ఉండాలని కనీస సదుపాయాలు అందేలా చూడాలన్నారు. ఖైదీలకు సమయానికి మూలాఖత్ అందించాలని జైలు అధికారులకు సూచించారు. ఖైదీలతో మాట్లాడిన అనంతరం వారి కోసం వండిన భోజనాన్ని రుచి చూశారు.

### పునరావాసం కల్పించండి

నిమ్జ్ బాధితుల నిరసన

జహీరాబాద్ టౌన్: రైతులు, రైతు కూలీలకు పునరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం నిమ్జ్ భూ బాధితులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముంగి, ఎల్గోయి, ముంగి తండా, బర్దిపూర్ తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ ఏరియా క్యాదర్శి బి.రాంచందర్ మాట్లాడుతూ...గత ప్రభుత్వం పాలనలో నిమ్జ్ ప్రాజెక్టు కోసం జీవో 123 ప్రకారం భూసేకరణ చేపట్టిందని, ఎకరాకు రూ.5లక్షల చొప్పున పరిహారం చెల్లించిందన్నారు. ప్రస్తుతం ఇస్తున్నట్లుగా ఎకరాకు రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు.

# సిలబస్ టెన్షన్

**పదో తరగతి సిలబస్ 10లోపు పూర్తి చేయాలి**

- 70 నుంచి 80శాతం లోపే పూర్తి
- సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రభావం
- దృష్టి పెట్టిన విద్యాశాఖ
- ప్రారంభమైన ప్రత్యేక తరగతులు
- సంక్రాంతి తర్వాతైనా పూర్తయ్యేనా!



నారాయణఖేడ్/ సంగారెడ్డి ఎడ్యుకేషన్: సర్కారు బడుల్లో టెన్త్ పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడంలో ఈ ఏడాది విద్యాశాఖ వెనుకబడింది. ప్రతీ ఏటా డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేసి జనవరి నుంచే రివిజన్ నిర్వహించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం బోధనలోనే ఉపాధ్యాయులు వెనుకబడిపోయారు. టెన్త్ పరీక్షలకు ఆయా సెలవులు పోను కేవలం 45రోజులే మిగిలి ఉన్నాయి. ఆలోగా పాఠ్యాంశాలు పూర్తి చేసి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది. పాఠ్యాంశాల్లో ఉపాధ్యాయులు వెనుకబడిపోయిన పరిస్థితి దాదాపు రాష్ట్రవ్యాప్తంగా చాలా పాఠశాలల్లో నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో 80% సిలబస్ పూర్తికాగా కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో 70% వరకే పూర్తి చేశారు. రాష్ట్ర విద్యాశాఖ ఈనెల 10వ తేదీలోపు పాఠ్యాంశాలు వందశాతం పూర్తి చేసి అనంతరం రివిజన్‌ను నిర్వహించాలని ఆదేశించింది. కానీ కొన్ని సబ్జెక్టుల్లో ఇది సాధ్యం కావడంలేదు.

**స్పెషల్ క్లాసులు ప్రారంభం...**

టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణతాశాతం పెంపు లక్ష్యంగా ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్పెషల్ క్లాసులను ప్రారంభమయ్యాయి. ఉదయం 8.15 నిమిషాల నుంచి 9.15 నిమిషాల వరకు తిరిగి సాయంత్రం స్కూలు ముగిశాక 4.15 నిమిషాల నుంచి 5.30నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పూర్తయిన సబ్జెక్టుల్లో ఆయా సబ్జెక్టు టీచర్లు పునఃశ్చరణ (రివిజన్) నిర్వహిస్తున్నారు.

**కేజీబీవీల్లో సమ్మె ప్రభావం..**

సమగ్ర శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ అధ్యాపకులు నెల రోజులపాటు సమ్మెకు దిగడంతో కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో 70% వరకే సిలబస్ పూర్తయ్యింది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గణితం, ఫిజికల్‌సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 80 నుంచి 90%లోపే పాఠ్యాంశాలు పూర్తయ్యాయి. గణితం సబ్జెక్టులో త్వరత్వరగా బోధన చేయడం సాధ్యపడదు. దీంతో ఈనెల 10వ తేదీలోపు వందశాతం సిలబస్ పూర్తి కావడం అనుమానమే. గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతోపాటు ముఖ్యమైన పాఠాలను ఎంపిక చేసి వారికి బోధించి స్లిప్ టెస్టులు నిర్వహించాలని విద్యా శాఖ సూచించింది.

**45 రోజుల్లోనే సన్నద్ధం చేయాలి**

టెన్త్ వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి జరగనున్నాయి. ఈలోగా పాఠ్యాంశాలు పూర్తి చేయడంతో పాటు రివిజన్ నిర్వహించాల్సి ఉంది. ఈనెల 11 నుంచి 17వరకు సంక్రాంతి సెలవులున్నాయి. ఈనెల 20 నుంచి పాఠశాలలు తిరిగి రెగ్యూలర్‌గా జరగనున్నాయి. సెలవులన్నీ పోగా పరీక్షలకు 45రోజులు మాత్రమే మిగిలాయి. ఈలోగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాల్సి ఉంది.

**సైన్స్‌లో పూర్తికాలేదు..**



సైన్స్ సబ్జెక్టులో పాఠాలు పూర్తి కాలేదు. 80%వరకు పాఠాలు పూర్తి చేశారు. ఇతర సబ్జెక్టుల్లో దాదాపుగా పూర్తయ్యాయి. పూర్తి కాని సబ్జెక్టులను అధ్యాపకులు బోధిస్తున్నారు.

– రమేశ్, 10వ తరగతి, ఉట్‌పల్లి

**మ్యాథ్స్‌లో 90%పూర్తి..**



మ్యాథ్స్ సబ్జెక్టులో 90% బోధన పూర్తయ్యింది. సైన్స్‌లో 80% వరకే పూర్తయ్యింది. త్వరగా నేర్చుకోవాలంటే కొంచెం కష్టంగా ఉంటోంది.

– సంతోశ్, 10వ తరగతి, జూకల్ తండా

**స్పెషల్ క్లాసులు ప్రారంభించాం**



జిల్లాలో జనవరి నుంచి స్పెషల్ క్లాసులు ప్రారంభించాం. సిలబస్ పూర్తి కాని పాఠశాలలపై దృష్టి సారించాం. రివిజన్ కూడా ప్రారంభమయ్యింది. 100% ఫలితాలు సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# వ్యాపార దృష్టితో చూడొద్దు

- మారుతున్న కాలానుగుణంగా విద్యా బోధన
- ట్రస్మా సమావేశంలో మంత్రి పొన్నం
- హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మారుతున్న కాలానికనుగుణంగా విద్యా బోధన జరగాలని, విద్యను వ్యాపార దృష్టితో కాకుండా పిల్లల భవిష్యత్ దృష్టితో చూడాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ చౌరస్తాలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....ప్రభుత్వ ఉద్యోగులు లేదా వ్యాపారవేత్తలు కాకుండా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించాలని సూచించారు. పాఠశాలలో చదివే విద్యార్థులు తెలంగాణ అభివృద్ధిలో కీలకం కావాలని ఆకాంక్షించారు. తాను విద్యార్థి నాయకుడిగా విద్యా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశానని, పార్లమెంట్ సభ్యుడిగా తెలంగాణ సాధన కోసం పనిచేశానని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు పునరుద్ధరణ తరగతులు జరుగుతాయో అదే విధంగా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా టీచర్స్‌కు బోధనపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రైవేట్‌లో పనిచేసే టీచర్లు, ఇతర సిబ్బంది సమస్యలను గుర్తిస్తామన్నారు. ఏ రాజకీయ పార్టీకి ట్రస్మా సంఘం తొత్తుగా ఉండొద్దని సూచించారు. సంఘం సమస్యలు, పాఠశాల సమస్యలు పరిష్కరించుకునేందుకే సంఘం కృషి చేయాలని తెలిపారు. తెలంగాణ సంపద 60 శాతం విద్యార్థులు తెలంగాణ ఆస్తి రూపంలో మీ ముందు ఉందని తెలిపారు.

**ఉపాధ్యాయుడి పాత్ర కీలకం: గూడెం**

భావి భారత పౌరులను తయారు చేయడంలో ప్రతీ ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమైనదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు పేద, మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రైవేటు పాఠశాలలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, సంఘం ప్రతినిధులు సాయి తేజ, జనార్దన్‌రెడ్డి, విలియమ్స్, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి నూతన రిజర్వాయర్ల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బొల్లారం, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ల ద్వారా మంచినీటి సరఫరా ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులు, మున్సిపల్ చైర్మన్‌లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఓఆర్ఆర్ పరిధిలో మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు పైప్‌లైన్‌లు వేస్తామన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో రెండు రిజర్వాయర్లు, పంప్‌హౌస్ పనులు పూర్తయ్యాయని, త్వరలో మంచినీటి సరఫరా చేస్తామని వివరించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ, లాలాబావి కాలనీ, బంధం కొమ్ములలో మూడు రిజర్వాయర్లు పూర్తయ్యాయని..ఈ నెల 20వ తేదీలోపు మంచినీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు.

**విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు**

జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్ చెరు, రామచంద్రపురం, భారతినగర్ డివిజన్ల పరిధిలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మూడు డివిజన్ల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ స్తంభాల స్థితిపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. రానున్న వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నిధుల సమస్య ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జలమండలి డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్ట్స్ శ్రీధర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, జలమండలి జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పడి రుణాలు అందించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సంగారెడ్డి జోన్: సహకార బ్యాంకులు నూతన రుణాలు అందజేయాలని కమర్షియల్ బ్యాంకులతో పోటీపడి రైతులకు సేవలు అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు. 2025–26 ఏడాదికి పంట రుణాల జారీకి వివిధ వ్యవసాయ ఉద్యాన పంటలకు వాస్తవిక రుణస్థాయిని నిర్ణయించడం, రికవరీకి గడువు తేదీని ఖరారు చేయడం వంటి అంశాలను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రుణాలివ్వడంతో పాటు వారి నుంచి డిపాజిట్ల సేకరణ కూడా జరపాలన్నారు.

**జాబ్ మేళాకు విశేష స్పందన**

జిల్లాలోని వివిధ కార్పొరేట్ కంపెనీలు, ప్రైవేట్ సెక్టార్ కంపెనీలలో వారి అర్హతల మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం జిల్లాలోని దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి కల్పన శాఖ మహిళా శిశు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్తంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన 156 మంది హాజరయ్యారు. 200 ఉద్యోగాలను కల్పించేందుకు 32 కంపెనీలు ముందుకు వచ్చాయి.

## కుక్కల మృతిపై విచారణ

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని ఎద్దుమైలారం సమీపంలో బ్రిడ్జిపై నుంచి కుక్కలను పడేసిన ఘటనపై బుధవారం డీఎల్పీవో అనిత విచారణ జరిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 4న 32 కుక్కలను బ్రిడ్జి పైనుంచి పడేయడంతో 21కుక్కలు మృతి చెందగా 11 కుక్కలు గాయపడ్డాయి. ఈ ఘటనపై ఇప్పటికే ఇంద్రకరణ్ పోలిస్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విచారణ చేపట్టిన డీఎల్పీవో ఘటనాస్థలికి వెళ్లి ఆ ప్రాంతమంతా బ్లీచింగ్ పౌడర్ చల్లించి శానిటైజ్ చేయించారు. అలాగే వివరాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి జబీన్‌తోపాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ జీవో పుస్తకావిష్కరణ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లు టీపీటీఎఫ్ జీవో బుక్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి జీవో పుస్తకం చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వై.అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# టీ హబ్ సేవలు భేష్: ఎన్‌హెచ్ఎం బృందం



- జిల్లా ఆసుపత్రి సందర్శన
- వివిధ విభాగాల సేవలు పరిశీలన

సంగారెడ్డి/రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధులపై జాతీయ వర్క్‌షాప్‌లో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జాతీయ ఆరోగ్య వైద్యాధికారుల (ఎన్ఎచ్ఎం) అధికారుల బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40మంది నాలుగు బృందాలు ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ విభాగాల సేవలను పరిశీలించింది. ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్, పాలియేటివ్ కేర్, టీహబ్ లను పరిశీలించి ఇక్కడ అమలవుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకుంది. టీహబ్ సేవలు బాగున్నాయని, తమ తమ రాష్ట్రాల్లో ఇలాంటి సేవలు అందించేలా ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నట్లు కేంద్ర బృందంలోని సభ్యులు తెలిపారు. బృందం వెంట (డీఎంఈ) డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, డీఎంహెచ్‌వో గాయత్రి దేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

**రామచంద్రాపురం, తెల్లాపూర్ పీహెచ్‌సీలను..**

రామచంద్రాపురం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ), తెల్లాపూర్ పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌ను బుధవారం కేంద్ర వైద్య బృందం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మందులను ఏవిధంగా అందిస్తున్నారు అనే విషయంపై ఆరా తీశారు. వారి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌ను పరిశీలించారు. ఈ కేంద్ర వైద్య బృందంలో డాక్టర్.బృంద, డాక్టర్.భానుప్రతాప్ సింగ్, డాక్టర్. జయేశ్ సోలంకి, డాక్టర్.నిషాద్‌ఖాన్, డాక్టర్.సుబ్రాన్సు శేఖర్ దత్త, డాక్టర్. అలెమ్వాబాంగ్ ఎయిర్‌తోపాటు స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

# పతంగి తెచ్చిన పండగ శోభ

- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న చిన్నారులు, యువకులు
- జిల్లాలో ప్రారంభమైన సంక్రాంతి సందడి
- చైనా మాంజాలు అమ్మితే కఠిన చర్యలే
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగురంగుల పతంగులు



చైనా మంజా విక్రయాలపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సందడి ప్రారంభమైంది. సంక్రాంతి అంటే మొదట గుర్తొచ్చేది పతంగులు వాటి వెంట పరుగులుతీసే పిల్లలు. వారి కోసం ఇప్పటికే మార్కెట్లో పతంగుల దుకాణాలు వెలిశాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ పట్టణ ప్రాంతాల నుంచి గాలిపటాలు, దారాలను తీసుకువచ్చి దుకాణదారులు విక్రయిస్తున్నారు. దీంతో పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. ఈసారి పతంగులు, మాంజా, దారాలు, చరఖా, చిన్న పిల్లలకు బొమ్మలతో వున్న రంగురంగుల పతంగులు మార్కెట్లో ఎక్కువగా వచ్చాయి. పిల్లలు ఇప్పటికే పతంగులను ఎగురవేస్తూ సంక్రాంతి పండగ శోభ తెస్తున్నారు.

**అప్రమత్తత అవసరం..**

పట్టణాల్లో మైదాన ప్రాంతాలు లేకపోవడంతో పెద్ద పెద్ద భవనాల నుంచి పతంగులను ఎగుర వేస్తుంటారు. పతంగులు పైకి ఎగురవేస్తున్న సమయంలో చిన్నారుల దృష్టి అంతా పతంగుల మీదే ఉంటుంది కానీ పక్క పరిసరాలపై ఉండదు. ఒక్కోసారి విద్యుత్ తీగలకు పతంగులు తగలడం, పగుళ్లు ఏర్పడ్డ గోడలు విరగడం వంటి ఘటనలతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందువల్ల పతంగులు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వీటికి తోడు చైనా మాంజాల వినియోగం పర్యావరణానికి హాని కలిగించడంతోపాటు పశు, పక్ష్యాదులకు ప్రాణ నష్టం కలుగజేసే అవకాశమున్నందున వీటి వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించింది. చైనా మాంజాల కారణంగా చేతులు తెగడం, పక్షులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గాలిపటాలు తెంపడానికి చైనా మాంజా సౌకర్యంగా ఉంటుంది. పోటాపోటీగా ఆకాశంలో ఎగురుతున్న పతంగి కోసేందుకు చైనా మాంజాతోనే సాధ్యపడుతుంది. కొన్ని రసాయనాలను కలిపి తయారు చేయడంతో దారం గట్టిగా అవుతుంది. దీనితో ప్రమాదాలకు కారణం అవుతుంది.

**చైనా మాంజా అమ్మితే చర్యలు**

ప్రమాదకర ప్లాస్టిక్, చైనా మాంజాలను వినియోగించకూడదు. నిషేధిత ప్లాస్టిక్, చైనా మాంజాల అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ అధికారులతో కలిసి దాడులు చేస్తున్నాం. చైనా మాంజాల వాడకం వలన ప్రతీ ఏటా అనేక మూగజీవులు, వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి వినియోగానికి దూరంగా ఉండాలి. పక్షులకు చుట్టుకుని వాటి ప్రాణాలు కోల్పోతున్నాయి. మాంజాలు వాడేవారిపైనా, అమ్మేవారిపైనా కేసులు నమోదు చేస్తాం.

–వేణుగోపాల్, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

**ఇవీ జాగ్రత్తలు...**

- గోడలు, భవనాలు బాల్కనీల పైనుంచి గాలిపటాలు ఎగురవేయకూడదు.
- చిన్న చిన్న గస్తీలు, భారీ భవన సముదాయాలు విద్యుత్ తీగలు, సెల్ ఫోన్ టవర్ల సమీపంలో ఎగురవేయకూడదు.
- పతంగులు విద్యుత్ తీగలు, స్తంభాలు, వాటిపై పడితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. అలా తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు.
- గాలిలో ఎగురుతున్న పతంగిని చూసుకుంటూ వాహనాలు గమనించకుండా వెళ్తుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది.
- నిషేధిత చైనా మాంజా వినియోగంతో గాలిపటాలు ఎగురవేసేవారి చేతి వేళ్లు తెగుతున్నాయి. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి.
- పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పక్కనే ఉండాలి.

## క్లుప్తంగా

### ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సాదియా నౌసిన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి)జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని సాదియా నౌసిన్‌ను బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్వహించిన బయోలజీ సైన్స్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన టెస్టులో మండల, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నౌసిన్‌కు హెచ్ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. నౌసిన్‌కు సహకరించిన జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు సరస్వతిని కూడా సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన శివాజీరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.44 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును బుధవారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే నివాసంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. నాగల్‌గిద్ద మండలం మావినెల్లికి చెందిన గోదావరికి రూ.60వేలు, ఎన్.జి హుక్రానకు చెందిన సత్యమ్మకు రూ.29,500 మంజూరు కాగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి అందజేశారు. నాయకులు మనోహర్ పటేల్, విష్ణువర్ధన్‌రెడ్డి, బస్వరాజ్, జానీపటేల్, సంగారెడ్డి పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఫోరం ఫర్ బెటర్ సంస్థ అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర

సంగారెడ్డి రూరల్: పోతిరెడ్డిపల్లి హిందూ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలను కల్పించాలని ఫోరం ఫర్ బెటర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర కోరారు . సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి హిందూ శ్మశాన వాటికను బుధవారం ఫోరం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి శ్మశాన వాటికకు పోతిరెడ్డిపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, రెడ్డికాలనీ, విద్యానగర్, బ్యాంకు కాలనీ, 10, 11, 12 వార్డులకు చెందిన ప్రజలు అంత్యక్రియలు చేయడానికి వస్తారని, ఇక్కడ కనీసం నీటి వసతి, లైటింగ్ సదుపాయాలు లేవన్నారు. ఉన్న చేతి పంపు బోర్ చెడి పోయిందని, హైమాస్ లైట్ ఉన్నా పనిచేయడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి వసతి, లైటింగ్ సౌకర్యం, రోడ్డు వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, సహాయ కార్యదర్శి పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

మునిపల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. బుదేరా పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్ నుంచి గుజరాత్‌కు లారీలో బియ్యం తరలిస్తుండగా కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో సివిల్ సప్లయ్ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 350 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా సదాశివపేట గోదాంకు తరలించినట్లు తెలి పారు. అధికారులు ఇంకా ఫిర్యాదు చేయలేదని, పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

### మందుబాబులకు జైలు, జరిమాన

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఐ సుమన్ కుమార్ టౌన్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలసి పాత బస్టాండ్ వద్ద, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో పలువురు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. తనిఖీల్లో పట్టుబడ్డ వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ముగ్గురికి రెండు రోజులు జైలు శిక్ష, మరో ముగ్గురికి రూ.2000 జరిమాన విధించారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు మీడియాకు వెల్లడించారు.



# కార్డులు సరే.. షాపులేవీ?

- హుస్నాబాద్‌లో వేధిస్తున్న రేషన్ షాపుల కొరత
- ప్రభుత్వం కార్డులు ఇస్తామనడంతో లబ్ధిదారుల్లో చిగురించిన ఆశలు
- ఇదే తరుణంలో దుకాణాలు పెంచాలంటూ డిమాండ్
- ఏళ్ల కొద్దీ 8 షాపులతోనే నిర్వహణ
- నరుకుల కోసం తప్పని దూరభారం

ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఇదే తరుణంలో దుకాణాలు కూడా పెంచాలని కోరుతున్నారు. రేషన్ దుకాణంలో పరిమితికి మించి కార్డుదారులు ఉండటం, సరుకులు తెచ్చు కోవడానికి దూర భారం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 వేలపైగానే జనాభా ఉన్న హుస్నాబాద్ పట్టణంలో కొన్నేళ్లుగా 8 రేషన్ దుకాణాలతోనే బియ్యం, సామగ్రి పంపిణీ చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో 2006 సంవత్సరంలో ఉన్న 8 రేషన్ దుకాణాలనే ఇప్పటి వరకు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 500 జనాభా దాటితే మరో రేషన్ దుకాణం ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో తెలుపు రేషన్ కార్డులు 5,336, అంత్యోదయ కార్డులు 429 ఉన్నాయి. ప్రస్తుతం తెలుపు రేషన్ కార్డు ఉన్న వారికి ప్రతి నెలా ఒక్కొక్కరికి 6 కిలోలు, అంత్యోదయ కార్డులు ఉన్న వారికి 35 కిలోల బియ్యం ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు.

**కార్డుల కోసం ఎదురుచూపులు**

ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు తినకుండా కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు దళారులకు అమ్ముతున్నారు. ఇవే బియ్యాన్ని మార్కెట్‌లో కిలోకు దాదాపు రూ.35 అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో దళారులు లాభపడుతున్నారని ప్రభుత్వం భావించింది. త్వరలోనే రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామని ప్రకటించడంతో చాలా మంది రేషన్ కార్డులకు కోసం ఎదురు చూస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం దాదాపు 1,000 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. ఏ సంక్షేమ పథకం లబ్ధిపొందాలన్న తెలుపు రేషన్ కార్డును ప్రామాణికం చేయడంతో వందలాది మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

**దూర భారంతో అవస్థలు...**

హుస్నాబాద్ పట్టణంలో 8 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం దుకాణాలు తక్కువగా ఉండటం, రేషన్ దారులు ఎక్కువ ఉన్నారు. కొన్ని దుకాణాల్లో వెయ్యికి పైగా రేషన్ కార్డు దారులు రేషన్ సరుకులు తీసుకుంటున్నారు. కొన్ని దుకాణాలకు వెళ్లాలంటే దాదాపు 2 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తుంది. జనాభాకు తగ్గట్లుగా రేషన్ దుకాణాలు లేకపోవడం, దుకాణాలు దూరంగా ఉండటంలో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే పట్టణంలో మరిన్ని రేషన్ దుకాణాలు పెంచాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ప్రస్తుత జనాభా ప్రకారం 10 నుంచి 15 వరకు దుకాణాలు పెంచాల్సి ఉంటుంది. కొత్త రేషన్ కార్డులు, దుకాణాలు పెంచే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని తహసీల్దార్ రవీందర్ రెడ్డి తెలిపారు.

**దుకాణాలు పెంచాలి**



కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయడం లేదు. ఉన్న దుకాణాలు దూరంగా ఉండటంతో సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. జనాభాకు తగ్గట్లుగా దుకాణాలు పెంచాలి. నిరుద్యోగ యువతను గుర్తించి వారిని డీలర్లుగా నియమించినట్లయితే ఉపాధి కల్పించడంతోపాటు కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది. సరుకుల పంపిణీలో సమయపాలన పాటించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కవ్వ వేణుగోపాల్ రెడ్డి, హుస్నాబాద్

తనయుడి జాడ కోసం వెళ్తుండగా..

# ఎదురొచ్చిన మృత్యువు

- రైలు ఢీకొని తండ్రి మృతి
- అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో ఘటన



నర్సింలు (ఫైల్)

రామాయంపేట(మెదక్): ఆత్మహత్య చేసుకుంటానని స్నేహితుడికి ఫొటో లు పంపిన కొడుకు ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి రైలు ఢీకొని మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. వివరాల్లోకి వెళ్తే.. భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గంగయ్య గారి నర్సింలు (48) ఆయన కుమారుడైన రాజశేఖర్‌లకు వారి దాయాది అయిన గంగయ్యగారి స్వామితో మంగళవారం భూమి విషయమై గొడవ జరిగింది. ఈ విషయమై స్వామి భిక్కనూరు పోలీసులకు నర్సింలు, రాజశేఖర్‌లపై ఫిర్యాదు చేశాడు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం నర్సింలు, కొడుకు రాజశేఖర్ మధ్య కూడా గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే నర్సింలు భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లోకుమారుడిపై ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ ఆత్మహత్య చేసుకోవాలని భావించి మెదక్ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి పట్టాలపై పడుకొని సెల్ఫీ ఫొటోను తన మిత్రుడికి పంపించాడు. వెంటనే సదరు మిత్రుడు ఈ విషయాన్ని గ్రామస్తులకు, నర్సింలుకు తెలియజేశాడు. అప్రమత్తమైన గ్రామస్తులు, నర్సింలు, ఆయన భార్య సత్తవ్వలు పోలీసులకు సమాచారం అందించి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. గ్రామస్తులు పోలీసులు ఒకవైపు, నర్సింలు ఆయన భార్య సత్తవ్వ మరో వైపు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు గ్రామస్తులకు రాజశేఖర్ కనిపించగా పట్టుకున్నారు. ఇంకో వైపు వెతు కున్న నర్సింలును అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తనయు ని ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి మృతి చెందడంతో భాగిర్తిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# విద్యార్థులను ప్రోత్సహించేందుకు పోటీలు



బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నర్సాపూర్: సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులను ప్రోత్సహించేందుకే తమ కాలేజీలో విష్ణు నేషనల్ కాంక్రీట్ కానో–2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు తెలిపారు. నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే పోటీల బుక్‌లెట్‌ను బుధవారం కాలేజీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు అద్భుతమైన అవకాశమని అన్నారు. కాంక్రీట్ పడవల నిర్మాణం, డిజైన్, బరువు, బలం తదితర టెక్నికల్ ప్రామాణికతతో పడవల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ.. పోటీల్లో 16 జట్లు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. బుక్ లెట్ ఆవిష్కరణ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబె, సివిల్ ఇంజనీరింగు విభాగం హెడ్ కృష్ణ, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏటలు అశోక్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

# శివ్వంపేటలో నకిలీ ఏఈ హల్‌చల్

- విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



నకిలీ ఏఈని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్న కార్మికుడు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి లింగోజిగూడ గ్రామంలో నకిలీ ఏఈ హల్‌చల్ చేశాడు. విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానంటూ గ్రామస్తుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడుతుండటంతో గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి సమ్య తండాకు చెందిన కాట్రోత్ సురేశ్ తాను కరెంటు ఏఈనని రూ.250 చెల్లిస్తే కొత్త మీటర్ ఇప్పిస్తానని గ్రామస్తులను నమ్మించాడు. కొందరికి అనుమానం వచ్చి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, స్థానిక లైన్‌మెన్ గోదూరి సురేశ్ గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. సదరు వ్యక్తితో విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు. ఇదే వ్యక్తి 5 రోజుల కిందట లైన్‌మెన్ గోదూరి సురేశ్‌కు ఫోన్ చేసి గోమారం 400 కేవీ విద్యుత్ ఏఈని మాట్లాడుతున్నాని పలు గ్రామాల్లో మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగం జరుగుతుంటే మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. ప్రజలను విద్యుత్ మీటర్ల పేరిట మోసం చేస్తున్న విషయం గురించి విద్యుత్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకున్న నకిలీ ఏఈని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

# మంత్రి పీఏనంటూ వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

- మహిళలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న నిందితుడు
- ఇవ్వని వారికి లైంగికంగా వేధింపులు



నిందితుడు యాదగిరి

కోదాడరూరల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనంటూ మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వ్యక్తిని బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. మెదక్ జిల్లా తుప్రాన్ మండలం కోనాయిపల్లికి చెందిన పంది యాదగిరి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల కిందట గూగుల్‌లో సెర్చ్ చేసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఫోన్ నంబర్లను తీసుకొని తాను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనని చెప్పి డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. డబ్బులు ఇవ్వని వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడు. కోదాడకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళతోపాటు హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, నూతనకల్, నేరేడుచర్ల సూపర్‌వైజర్లకు కూడా రెండు నెలల కిందట ఫోన్ చేసి తాను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏ నరేశ్‌రెడ్డిని అని చెప్పి లైంగికంగా వేధించడంతో బాధితులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం యాదగిరి హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సులో వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో కోదాడలో అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఐడీ పార్టీ సిబ్బంది బాలు, శ్రీనివాస్, రామారావు, సతీష్‌నాయుడు, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల వినియోగంపై అప్రమత్తత



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ మురళి

సంగారెడ్డి, ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో 'మత్తుపదార్థాల వినియోగం – దుష్పరిణామాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూ యువజన కేంద్రం రిసోర్స్ పర్సన్ మురళి మాట్లాడుతూ.. వివిధ రూపాలలో నేటి యువత, విద్యార్థులు మత్తు పదార్థాలను స్వీకరిస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల మానసిక సమస్యలే కాకుండా అనేక ఆరోగ్యకరమైన సమస్యలు వస్తాయని తెలిపారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానంగా గంజాయి, హెరాయిన్, ఆల్ప్రెజోల్, గుడుంబా ఎక్కువగా పెరిగిందన్నారు. వీటి బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాలను అమ్మినా, కొన్నా నేరమని మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ రత్నప్రసాద్, ఎక్సైజ్ సీఐ అనుదీప్, వైస్ ప్రిన్సిపాల్స్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక, ఎన్ఎస్ఎస్ అధికారులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటి వెనుకాల గంజాయి సాగు

వ్యక్తి అరెస్ట్, మొక్కలు స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పోలీసుల గంజాయి పట్టుకున్నారు. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహ్మద్ షబ్బీర్ కొద్ది రోజులుగా ఇంటి వెనుకాల ఉన్న భూమిలో గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. గంజాయి మొక్కల నుంచి తీసిన ఆకులను ఎండబెట్టి వాటిని బిహార్‌కు చెందిన కూలీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. పోలీసులకు అందిన సమాచారంతో షబ్బీర్ ఇంటితో పాటు పరిసరాలను తనిఖీ చేసి రెండు గంజాయి మొక్కలతోపాటు 38 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిర్మల తదితరులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం రైతు భరోసా రూ.12వేలు అందించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. బుధవారం పట్టణంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సాగు చేసే రైతులకు భరోసా కల్పించటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, సంగారెడ్డి మార్కెటింగ్ చైర్మన్ రామచందర్ నాయక్, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సడకుల కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నక్కని ఎల్లవ్వ (60) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో ఆమె కప్పుకున్న శాలువ చెరువు కట్ట తూమ్ వద్ద లభించింది. చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. జీవితంపై విరక్తి చెంది తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు నక్కని చిన్నస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

**కుటుంబ కలహాలతో వ్యక్తి..**

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పర్కి సుమన్(33)కు భార్య ప్రభతోపాటు ఆరేళ్లలోపు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. సుమన్‌తోపాటు కుటుంబ సభ్యులు భూమిని విక్రయించగా వచ్చిన డబ్బుతో ఇంటి నిర్మాణం చేపట్టారు. మరికొంత డబ్బును తెలిసిన వారి వద్ద ఉంచారు. డబ్బుల విషయంలో కుటుంబంలో మనస్పర్థలు వచ్చి 5వ తేదీన సుమన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. తన చావుకు వీరే కారణమంటూ గ్రామానికి చెందిన కొందరి పేర్లను రాసి ఇదే తన మరణవాంగ్మూలమని మూడ్రోజుల కిందట గ్రామంలోని ఓ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా అది వైరల్‌గా మారిందని గ్రామస్తుల ద్వారా తెలిసింది. కుటుంబ కలహాలతో సుమన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఉరేసుకొని బాలుడు..**

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు..మండలంలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన వెంకయ్య కుమారుడు శివ(17) బుధవారం గ్రామ సమీపంలో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. బాలుడి ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# బైక్‌ను ఢీకొట్టిన బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు



కల్హేర్(నారాయణఖేడ్): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశం కథనం మేరకు.. నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన పాండు మోటార్ సైకిల్‌పై నిజాంపేట్ వైపు వెళ్తున్నాడు. పిట్లం నుంచి వస్తున్న హైదరాబాద్–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పాండుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. అలాగే బస్సు పక్కనే ఆటోను ఢీకొట్టింది. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

# వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా

- ఎన్‌సీడీ సేవలను పరిశీలించిన కేంద్ర వైద్యారోగ్య కుటుంబ, సంక్షేమ శాఖ అధికారులు
- సిద్దిపేట ప్రభుత్వానుపత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖాన తనిఖీ



డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటకమాన్/ వర్గల్(గజ్వేల్)/ములుగు(గజ్వేల్): సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలో అందుతున్న ఎన్‌సీడీ వైద్య సేవలను కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారులు బుధవారం పరిశీలించారు. అసంక్రమిత వ్యాధులపై హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ సెమినార్‌లో ఈ పరిశీలనకు వచ్చారు. ఉత్తర ప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథిసేన్ శర్మ, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్నన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆరాధన పట్నాయక్, చత్తీస్‌ఘడ్ నేషన్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ దయరామ్, రాజస్థాన్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ భారతి దీక్షిత్, ఇంద్రాణి కౌషల్, నాగాలాండ్ ఎన్‌హెచ్ఎం అకొసరహితోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ కార్యక్రమ అధికారులు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ సెంటర్, తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్, సిద్దిపేట అర్బన్ నాసర్‌పూర్ పీహెచ్‌సీ, బస్తీ దవాఖానలను పరిశీలించారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల వైద్య సేవల కోసం ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలు, వైద్య సేవలను కలెక్టర్ మనుచౌదరి వారికి వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సైకియాట్రీ విభాగ హెచ్ఓడీ డాక్టర్ శాంతి, ఆర్ఎంఓలు డాక్టర్ శాంతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, వైద్యులు, సిబ్బంది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**వర్గల్, నెంటూరు సందర్శన**

బీపీ, షుగర్ తదితర అసంక్రామిత వ్యాధులపై హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో భాగంగా బుధవారం వర్గల్ మండలం నెంటూరు ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్(పల్లె దవాఖాన)ను కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ అధికారుల బృందం సందర్శించింది. అలాగే, కేంద్ర బృందం ఉదయం వర్గల్ సరస్వతీ క్షేత్రం సందర్శించింది. వారికి స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ హరిత ఆధ్వర్యంలో సాదర స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకొని, వేదాశీర్వచనం పొందారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే, ములుగు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మామిడ్యాల సబ్‌సెంటర్‌ను కేంద్ర బృందం సందర్శించింది.



వర్గల్(గజ్వేల్): నెంటూరు పల్లె దవాఖాన వద్ద కేంద్ర బృందంతో స్థానిక వైద్యసిబ్బంది